రోహిత్ భవితవ్యానికి 'ఫైనల్' లింక్!

ముంబై: చాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత క్రికెట్ జట్టు సారథి రోహిత్ శర్మ ఇంకా వన్డేలతో పాటు టెస్టులలోనూ కొనసాగుతాడా? ఒకవేళ జట్టులో కొనసాగినా నాయకత్వ పగ్గాలు ఇతరులకు అప్పజెప్పుతాడా? బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో టీమ్ఇండియా ఘోర వైఫల్యం తర్వాత మొదలైన ఈ అంశం మరోసారి చర్చనీయాంశమైంది. న్యూజిలాండ్‌తో చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ఫలితాన్ని బట్టి రోహిత్ భవితవ్యంపై బీసీసీఐ కఠిన నిర్ణయాలు తీసుకోనున్నట్టు బోర్డు వర్గాల సమాచారం. వయసు, ఫిట్‌నెస్, ఫామ్, ఇతరత్రా కారణాలతో రోహిత్‌ను వన్డేల నుంచి తప్పించి 2027 వన్డే ప్రపంచకప్ నాటికి మరో నాయకుడిని సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఉన్న బీసీసీఐ.. ఇదే విషయాన్ని రోహిత్‌తో చర్చించినట్టు వినికిడి. ఇదే విషయమై చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, హెడ్‌కోచ్ గౌతం గంభీర్.. రోహిత్‌తో ఇది వరకే చర్చించినట్టు తెలుస్తోంది. అయితే రోహిత్ మాత్రం మరికొంతకాలం కొనసాగేందుకు మొగ్గుచూపుతున్నాడని, రిటైర్మెంట్ నిర్ణయాన్ని బీసీసీఐ అతడికే వదిలేసినట్టు బోర్డు ప్రతినిధి ఒకరు తెలిపారు. రోహిత్‌తో పాటు కోహ్లీతోనూ బోర్డు చర్చించిందని, అయితే అతడి విషయంలో తొందరపాటు ఏం లేదని ఆయన చెప్పారు. అంతే గాక ఫైనల్ తర్వాత ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్టులలోనూ మార్పులు చేసే అవకాశముంది. శ్రేయాస్‌కు తిరిగి బోర్డు కాంట్రాక్టు దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

గుజరాత్ గర్జన

- ఢిల్లీపై అద్భుత విజయం
- హర్లీన్ డియోల్ అదుర్స్
- లానింగ్ మెరుపులు వృథా

లక్నో: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 3వ సీజన్‌లో పడుతూ లేస్తూ సాగుతున్న గుజరాత్ జెయింట్స్.. టేబుల్ టాపర్స్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు షాకిచ్చింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో జెయింట్స్ దుమ్మురేపి పాయింట్ల పట్టికలో ముంబైని వెనక్కినెట్టి రెండో స్థానానికి దూసుకొచ్చింది. హర్లీన్ డియోల్ (49 బంతుల్లో 70 నాటౌట్, 9 ఫోర్లు, 1 సిక్స్), బెత్ మూనీ (44), డాటిన్ (24) విజృంభించడంతో ఢిల్లీ నిర్దేశించిన 178 పరుగుల ఛేదనను ఆ జట్టు మరో 3 బంతులు మిగిలుండగానే దంచేసి ప్లేఆఫ్స్ బెర్తుకు మరింత చేరువైంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన క్యాపిటల్స్‌కు సారథి మెగ్ లానింగ్ (57 బంతుల్లో 92, 15 ఫోర్లు, 1 సిక్స్), షెఫాలీ వర్మ (27 బంతుల్లో 40, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) వేగంగా పరుగులు రాబట్టారు. హర్లీన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

లానింగ్ దూకుడు

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన ఢిల్లీ జట్టుకు ఓపెనర్లు లానింగ్, షెఫాలీ అదిరిపోయే శుభారంభాన్ని అందించడంతో క్యాపిటల్స్ భారీ స్కోరు సాధించింది. ఈ ఇద్దరూ మొదటి వికెట్‌కు 8.6 ఓవర్లలోనే 83 పరుగులు జోడించారు. డాటిన్ వేసిన తొలి ఓవర్లోనే లానింగ్ మూడు బౌండరీలు బాదింది. కాశ్వీ రెండో ఓవర్లో షెఫాలీ 4, 4, 6తో 14 పరుగులు రాబట్టింది. గార్డ్‌నర్ 8వ ఓవర్లో లాంగాఫ్ మీదుగా భారీ సిక్సర్ బాదిన షెఫాలీ.. మేఘనా సింగ్ 9వ ఓవర్లో లిచ్‌ఫీల్డ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. షెఫాలీ నిష్క్రమించినా లానింగ్ దూకుడు ఆపలేదు. కన్వర్ 12వ ఓవర్లో ఎక్స్‌ట్రా కవర్ మీదుగా సిక్సర్ బాది 35 బంతుల్లోనే అర్ధశతకం పూర్తిచేసింది. జొనాసెన్ (9), రోడ్రిగ్స్ (4) విఫలమైనా లానింగ్ బ్యాట్ ఝుళిపించింది. అయితే ఆఖర్లో 92 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఉండగా ఆమె.. 20వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయి క్లీన్‌బౌల్డ్ అయింది.

హర్లీన్ పోరాటం

ఛేదనలో గుజరాత్ రెండో ఓవర్లోనే హేమలత (1) వికెట్‌ను కోల్పోయింది. కానీ మూనీ, హర్లీన్ మాత్రం ఢిల్లీ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. కాప్ 5వ ఓవర్లో మూనీ ఓ బౌండరీ కొట్టగా హర్లీన్ రెండు ఫోర్లు సాధించింది. సదర్లాండ్ 9వ ఓవర్లోనూ ఈ ఇద్దరూ మూడు సార్లు బంతిని బౌండరీ లైన్ దాటించారు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని మిన్ను మణి 12వ ఓవర్లో విడదీయడంతో 85 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. శిఖా పాండే 16వ ఓవర్లో తొలి బంతినే బౌండరీకి తరలించిన హర్లీన్ హాఫ్ సెంచరీ పూర్తిచేసింది. కానీ ఇదే ఓవర్లో గార్డ్‌నర్ (22) భారీ షాట్ ఆడబోయి మిన్ను మణి చేతికి చిక్కింది. చివరి 3 ఓవర్లలో ఆ జట్టు విజయానికి 32 పరుగులు అవసరం కాగా జొనాసెన్ ఓవర్లో డాటిన్(24) 4, 6, 4తో విజృంభించింది. కానీ జొనాసెన్ అదే ఓవర్లో డాటిన్, లిచ్‌ఫీల్డ్‌ను ఔట్ చేయడంతో గుజరాత్ శిబిరంలో ఆందోళన కలిగింది. కానీ హర్లీన్, కాశ్వీ(9 నాటౌట్) లాంఛనాన్ని పూర్తిచేశారు.

హర్లీన్ (70*)

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ క్యాపిటల్స్: 20 ఓవర్లలో 177/5 (లానింగ్ 92, షెఫాలీ 40, మేఘనా 3/35, డాటిన్ 2/27); **గుజరాత్ జెయింట్స్:** 19.3 ఓవర్లలో 178/5 (హర్లీన్ 70 నాటౌట్, మూనీ 44, పాండే 2/31, జొనాసెన్ 2/38)

చాంపియన్ అరవింద్

ప్రేగ్ మాస్టర్స్ గెలుచుకున్న చెన్నై చిన్నోడు

ప్రేగ్: చెక్ రిపబ్లిక్ వేదికగా జరిగిన ప్రేగ్ మాస్టర్స్ చెస్ చాంపియన్‌షిప్‌ను భారత యువ గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం గెలుచుకున్నాడు. శుక్రవారం జరిగిన తొమ్మిదో రౌండ్ పోరులో ఈ చెన్నై కుర్రాడు.. చెక్‌కే చెందిన డేవిడ్ నవారాతో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. 9 రౌండ్లు ఉన్న ఈ టోర్నీలో అద్భుతంగా రాణించిన అరవింద్.. 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి చాంపియన్‌గా అవతరించాడు. ఆడిన రెండు క్లాసికల్ సూపర్ టోర్నమెంట్‌లలో అరవింద్ రెండింట్లోనూ విజేతగా నిలవడం విశేషం. ఈ టోర్నీలో ఫేవరేట్‌గా బరిలోకి దిగి ఏడో రౌండ్ వరకూ అరవింద్‌తో సమానంగా నిలిచిన మరో యువ భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద.. 5 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

ప్రాక్టీస్ ప్రాక్టీస్

కివీస్‌తో ఫైనల్‌కు టీమ్ఇండియా కసరత్తులు

దుబాయ్: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీని ముచ్చటగా మూడోసారి దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉన్న టీమ్ఇండియా అందుకు తగ్గట్లు వ్యూహాలు రచిస్తున్నది. మెగాటోర్నీలో ఓటమి అన్నది ఎరుగకుండా అజేయంగా దూసుకెళుతున్న రోహిత్‌సేన..ఫైనల్లో న్యూజిలాండ్‌ను ఎదుర్కొనుంది. ఇందుకోసం టీమ్ఇండియా క్రికెటర్లు ప్రాక్టీస్‌లో చెమటోడుస్తున్నారు. ఐసీసీ మెగాటోర్నీల్లో తమకు కొరకరాని కొయ్యగా మారిన కివీస్‌కు ఎలాగైనా చెక్ పెట్టాలన్న ఉన్న భారత్ శుక్రవారం ప్రాక్టీస్‌లో మునిగి తేలింది. లీగ్ దశలో న్యూజిలాండ్‌ను ఓడించిన టీమ్ఇండియా అదే రీతిలో ఆదివారం జరిగే పోరులోనూ సత్తాచాటాలని చూస్తున్నది. చాంపియన్స్ ట్రోఫీలో తమ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో ఆడుతుండటం మనకు కలిసొచ్చే అంశం కాగా, కివీస్‌కు ఇక్కడి పరిస్థితులు కొత్తగా ఉన్నాయి. ఇదిలా ఉంటే బలబలాల పరంగా చూస్తే ఇరు జట్లు సమవుజ్జీలుగా కనిపిస్తున్నా..మ్యాచ్ రోజు అదృష్టం ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుత టీమ్ ఫామ్ చూస్తే బ్యాటింగ్, బౌలింగ్ పరంగా కివీస్ కంటే మెరుగ్గా కనిపిస్తున్నది. బ్యాటింగ్‌లో కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, రాహుల్, రోహిత్, గిల్, హార్దిక్ వీరిలో ఏ ఇద్దరు నిలదొక్కుకున్నా..మ్యాచ్ స్వరూపం మారిపోవడం ఖాయం. కివీస్ విషయానికొస్తే..రచిన్ రవీంద్ర, విలియమ్సన్ సూపర్ ఫామ్‌మీదున్నారు. హెన్రీ గాయం జట్టును కలవరపెడుతున్నది.

ఇంగ్లండ్ వన్డే సారథిగా స్టోక్స్?

లండన్: ఇంగ్లండ్ టెస్టు జట్టు సారథి బెన్ స్టోక్స్ వన్డేలలోనూ ఆ బాధ్యతలు మోయనున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. భారత్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌తో పాటు చాంపియన్స్ ట్రోఫీలో ఒక్క మ్యాచ్ కూడా గెలవకుండానే ఇంటిబాట పట్టిన తర్వాత ఆ జట్టు నాయకుడు జోస్ బట్లర్.. సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో కొత్త నాయకుడి వేటలో పడ్డ ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ).. టెస్టులలో ఆ జట్టును విజయవంతంగా నడిపిస్తున్న స్టోక్స్ వైపే మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. కాలిగాయంతో ఆటకు దూరమైన స్టోక్స్ ప్రస్తుతం అబుదాబిలో రికవరీ అవుతున్నాడు. మరి ఇదివరకే వన్డేలకు ఓసారి రిటైర్మెంట్ ప్రకటించి వన్డే వరల్డ్ కప్ సందర్భంగా మళ్లీ జట్టులోకి వచ్చిన అతడు.. ఈసీబీ కోరిక మేరకు నాయకత్వ పగ్గాలు చేపడతాడా? లేదా? అన్నది త్వరలో తేలనుంది.

హెన్రీ అనుమానమే!

ఫైనల్‌కు ముందు కివీస్‌కు షాక్

దుబాయ్: భారత్‌తో చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ పోరుకు ముందు న్యూజిలాండ్‌కు భారీ షాక్ తప్పేట్టు లేదు. ఈ టోర్నీలో అత్యధిక వికెట్ల వీరుడి (10)గా ఉన్న మాథ్యూ హెన్రీ ఫైనల్‌లో ఆడటం అనుమానంగానే మారింది. దక్షిణాఫ్రికాతో రెండో సెమీస్ సందర్భంగా అతడు క్యాచ్ పడుతుండగా భుజానికి గాయమైంది. వైద్య పరీక్షల అనంతరం అతడు ఫైనల్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండటం అనుమానమేనని కివీస్ కోచ్ గ్యారీ స్టెడ్ స్పష్టం చేశాడు. లీగ్ దశలో భారత్‌తో ఆడిన మ్యాచ్‌లో హెన్రీ.. ఐదు వికెట్లు (5/42) పడగొట్టి టీమ్ఇండియా బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీసిన విషయం విదితమే.

రంజాన్ సందర్భంగా రాత్రంతా క్రికెట్ మ్యాచ్

రావల్పిండి: పాకిస్థాన్‌లో జరుగుతున్న ప్రెసిడెంట్ ట్రోఫీ గ్రేడ్-1 టోర్నమెంట్ ఫైనల్‌ను నిర్వాహకులు వినూత్నంగా నిర్వహిస్తున్నారు. రంజాన్ మాసం కావడంతో ఆటగాళ్ల ఉపవాస దీక్షలకు ఇబ్బందులు తలెత్తకుండా మ్యాచ్ మొత్తాన్ని ఫ్లడ్‌లైట్ల వెలుతురు కింద రాత్రే ఆడిస్తున్నారు. పాక్ కాల మానం ప్రకారం రాత్రి 7:30 గంటలకు మొదలయ్యే మ్యాచ్ మరుసటి రోజు తెల్లవారుజామున 2:30 గంటలకు ముగుస్తుంది. మూడు సెషన్లుగా జరిగే మ్యాచ్‌లో ఫస్ట్ సెషన్‌లో 20 నిమిషాల టీ బ్రేక్, రెండో సెషన్ తర్వాత డిన్నర్.. ఇక ఆఖరిదైన మూడో సెషన్ 2:30 దాకా కొనసాగుతోంది. పింక్ బాల్‌తో ఈ మ్యాచ్‌ను ఆడిస్తున్నారు. పాకిస్థాన్ టెలివిజన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్థాన్ మధ్య జరుగుతున్న మ్యాచ్‌ను పింక్‌బాల్‌తో ఆడిస్తున్నారు.

యువ బాలికలను మరింత వృద్ధిలో తీసుకురావాలన్న ఉద్దేశంతో హిమాలయ వెల్‌నెస్ 'హిమాలయ వండర్‌వుమన్' ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో కలిసి పనిచేయనుంది.

భారత్, పాక్ పోరు @ 20 కోట్లు

టెలివిజన్ చరిత్రలో కొత్త రికార్డు

దుబాయ్: చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ పోరు క్రేజ్ మరో స్థాయికి చేరుకుంది. చాంపియన్స్ ట్రోఫీలో దాయాదుల పోరు కొత్త రికార్డులకు వేదికైంది. దుబాయ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌ను టెలివిజన్లలో ఏకంగా 20.6 కోట్ల మంది వీక్షించారట. బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్(బీఏఆర్‌సీ) చరిత్రలో అత్యధిక మంది చూసిన రెండో మ్యాచ్‌గా ఇది రికార్డుల్లోకెక్కింది. 2023లో అహ్మదాబాద్‌లో జరిగిన భారత్, పాక్ మ్యాచ్ కంటే 11శాతం ఎక్కువ చాంపియన్స్ ట్రోఫీ పోరును చూసినట్లు అధికారిక ప్రసారదారు జియో హాట్‌స్టార్ పేర్కొంది. దుబాయ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో పాక్‌పై భారత్ విజయదుందుభి మోగించింది. స్టార్ బ్యాటర్ విరాట్‌కోహ్లీ అజేయ సెంచరీతో చెలరేగిన వేళ టీమ్ఇండియా చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

సెమీస్‌కు ఆయూష్

ఒర్లీన్స్: సీనియర్లందరూ విఫలమైనా ఒర్లీన్స్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ బరిలో నిలిచిన యువ భారత షట్లర్ ఆయూష్ శెట్టి అదరగొడుతున్నాడు. ఈ టోర్నీలో అతడు సెమీస్‌కు దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్ పోరులో ఆయూశ్ 21-16, 21-23, 21-17తో రస్మస్ (డెన్మార్క్)పై సత్తా చాటాడు. తన కంటే మెరుగైన, ప్రపంచ పదో ర్యాంకర్ అయిన రస్మస్‌పై అయూశ్ హోరాహోరీగా పోరాడి విజయాన్ని అందుకున్నాడు.